


బ్రెయిన్ ఈటర్స్

"మేనిటర్స్ ఆఫ్ మాల్గుడి" అని ఆర్కే నారాయణ్ ఒక నవల రాసేరు. భూమ్మీద మేనీటర్సున్నారో లేదో నాకు తెలియదు. మాల్గుడి అనే ఊరు ఎక్కడుందో అంతకంటే తెలీదు. కాని బ్రెయినీటర్స్ మాత్రం ఎక్కడ పడితే అక్కడ దొరుకుతారు. ఎందెందు వెతికిన అందందే కల డంటూ బ్రెయినీటర్స్ గురించి హామీ పత్రం రాసివ్వొచ్చు.

బ్రెయినీటింగ్ అనే ప్రక్రియ అతి దారుణం. కత్తితో పొడిచినా తట్టుకోవచ్చుగానీ, మెదడ్ని తినే ప్రయత్నం చేస్తే, మనిషి కుదేలై పోతాడు. బ్రెయినీటర్లకు దాసోహమవడం మనదే తప్పు. కానీ, ఇక్కడో పాయింటుంది. మనమీద మనకి నమ్మకం తక్కువ. మన నిర్ణయాలు కరెక్టో, కాదో ఢంకా మోగించి చెప్పలేం. ఇది మన వీక్నెస్. సరిగ్గా ఈ బల

హీనత మీద బ్రెయినీటరు దాడి చేస్తారు. కొన్ని కేసులు విజయవంతమైనా మెజారిటీ విషయాల్లో గోతిలో పడిపోతాం.

మెదళ్ళు తినే వాళ్ళెవరూ బోర్డులు కట్టుకుని రోడ్డుమీద తిరగరు. వీళ్ళు మన ఆత్మీయుల్లోనూ, స్నేహితుల్లోనూ విరివిగా దొరుకుతారు. విరోధిగాని, అపరిచితుడుగాని మన మెదడు జోలికి అంత చొరవగా రాడు. వచ్చినా అతని కార్యక్రమం నిరాటంకంగా సాగదు. బట్టల దుకాణంలో మనకి నచ్చిన షర్టింగో, కోటింగో వచ్చి వుంటుంది. కొనుక్కుందామని వెడతాం. కళ్ళు మూసుకొని కొనుక్కొచ్చేస్తే పేచీ లేదు. బలహీనతని మనవి చేశాను గదా .... లేటెస్టు డిజైనులు చూపించమని షాపు మనిషి నడుగుతాం. ఇక ప్రారంభమవుతుంది దాడి. దుకాణంలో బట్టలన్నీ మన ముంద రేస్తాడు. దాంతో ఒరిజినల్ అయిడియాలో మార్పు లొస్తాయి. మార్పు లొస్తున్నాయని షాపతను గమనిస్తాడు. ఏది చెల్లుబడి కాదో దాన్ని గురించి అరగంట గొప్పగా చెబుతాడు. మెదడు తినడం ప్రారంభమైందని మనకు తెలీదు. మనం అనుకున్న షర్టింగో, కోటింగో మన కంటికి చీప్‌గా, వెగటుగా కనిపిస్తుంది. అతడు వర్ణించి చెప్పిన డిజైనే తీసుకుంటాం. టైలరు కిస్తే అతను మన టేస్టుకు సిగ్గు నభినయిస్తాడు. ఆ అభినయం కూడా బ్రెయినీటింగే.

ఈ దిక్కుమాలిన క్లాతెవడండి అంటగట్టేడు మీకని బాణం వేస్తాడు. దెబ్బకి కృంగిపోతాం. అనుకున్న దాన్నెలాగో వదిలేసేం. ఆ బాధ అట్లా వుండగా తెచ్చుకున్నదాన్ని కూడా ఛీ! అని సర్టిఫికెటిస్తే మన గతేం కావాలి ?

మంచి కథో, కవిత్వమో రాయాలని కూచున్నారు. మెదడ్తో పని. చిరాకు, పరాకులు దరిదాపుల్లోకి రాకూడదు. చాలా సీరియస్‌గా మూడ్‌లో వున్నారు. సగం రాసి భేషనుకుంటుండగా ఫ్రెండెవడో వస్తాడు. ఫ్రెండే కదాని, రాసినంతవరకు చదివి వినిపిస్తారు. విన్నవాడు విన్నట్టు వూరుకోడు. ఇలాంటిదే ఎక్కడో, ఎప్పుడో చదివినట్టు గుర్తని మీ మెదడ్ని పొడిచి వెళ్ళిపోతాడు. గోవింద! అక్షరం నడవదు. మీ రంతవరకూ రాసినదంతా

చెత్తలా కనిపిస్తుంది. బాయిలర్లో వేసి తగలెట్టేవరకూ మనస్థిమితం వుండదు.

పేకాటలో అందరూ బ్రెయినీటర్లే. తాను డ్రాప్‌చేసి నిశ్చింతగా ఎవడూ కూచోడు. పక్క మనిషి పేకలో తల పెట్టేస్తాడు. ఆడుతున్న మనిషి విసుక్కున్నా సిగ్గుపడడు. ఛీ! పొమ్మని కేకలు వేసినా అంగుళం కదలడు. ఆట చూస్తే చూసేడు. ఉచిత సలహాలిస్తాడు. ఆడే అతని మనసు కిష్టమైనట్టు ఆడనివ్వడు. అతనికి ఏది ఇష్టము లేదో సరిగ్గా ఆ కార్డునే వేయమంటాడు. వేసేంత వరకూ శతపోరు పెడతాడు. అతడికి లొంగిపోయి, ఆ కార్డు వేస్తాడు. ఆ కార్డు తీసుకుని పక్క మనిషి ఆట తిప్పుతాడు. గుర్రప్పందేల్లో కూడా ఇదే తంతు జరుగుతుంది. ఖచ్చితంగా వస్తుందనుకున్న డ్రీమ్‌లేండ్‌ని వదిలి స్కౌండ్రల్ మీద పందెంగాసి, స్కౌండ్రలై పోయే సన్నివేశాలు కూడా బ్రెయినీటింగుకి సంబంధించిన ఫీచేమరి.

అన్ని ప్రశ్నలు శ్రద్ధగా చదివి, పరీక్ష రాయాలనే పవిత్ర ఆశయం బ్రెయినీటింగులకి బలి కాబడుతుంది. పేపరవుటయిందనీ....అదనీ, ఇదనీ మెదడుమీద దాడి చేస్తారు. అన్నీ చదవడం మానేసి, కొన్ని ప్రశ్నలే ప్రిపేరై అన్యాయమైపోతారు. మనిషి ప్రాథమికంగా సంఘజీవి. పదిమందిలో కలిసి తిరగడం, పదిమంది అభిప్రాయాలు సేకరించడం తప్పని సరి. ఈ పద్ధతిలో ఎవరు బ్రెయిన్ ఈటర్లో, ఎవరు కాదో తేల్చుకోవడం తలకుమించిన పని. అందుచేతని అంటున్నాను .... నేను గావచ్చు, మీరు గావచ్చు. మనలో ప్రతివారు ఎప్పుడో ఒకప్పుడు బ్రెయినీటర్ల వాతపడే వుంటాం. ఒక్కోసారి మనమే కొందరికి బ్రెయినీటర్ల మవుతుంటాం.